సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 7 । జనవరి । 2023



ఉజ్వల భవితకు నవోదయం

గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉజ్వల భవితకు సోపానం నవోదయ విద్యాలయం. -8లో..



ప్రాజెక్ట్‌వల్ల అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు

ప్రాజెక్ట్ నిర్మాణంతో అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు కలుగుతాయని డీఆర్‌ఓ సత్యనారాయణరావు తెలిపారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.160
రెండోరకం	రూ.70	రూ.108

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 163 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మెల్మరువత్తూరుకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తమిళనాడు రాష్ట్రం మెలమ్మవత్తూరు పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్వీ నిరంజన్ తెలిపారు. 40 మంది బ్యాచ్‌గా వెళ్లనట్లయితే అల్ట్రాడీలక్స్ ఒకరికి రూ. 830, ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.685 రాను పోను చార్జీలు చెల్లించాలన్నారు. నాలుగు టిక్కెట్లు కన్నా ఎక్కువ ఉన్నట్లయితే ఇంటి వద్దకే టిక్కెట్లు తెచ్చి ఇస్తామన్నారు. సంక్రాంతికి చైన్నైకి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. గాలివీడు మార్గంలో నడిచే ప్రయాణికుల కోసం లక్కీడిప్ ఈనెల 28న తీయనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆదరించాలని కోరారు.

11న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మదనపల్లె సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న అండర్-14 ,17 బాలి,బాలికల అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ వసంత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం జెడ్పీహెచ్‌ఎస్‌లో వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం లాంగ్ డిస్టెన్స్ రన్స్ మొదలవుతుందని, ప్రతి వ్యాయామ ఉపాధ్యాయులు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

రక్తహీనత తగ్గిస్తే మాతాశిశు మరణాలు తగ్గుతాయి



మాట్లాడుతున్న జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి లోకవర్ధన్

వాల్మీకిపురం: రక్తహీనత తగ్గిస్తే మాతా, శిశు మరణాలు తగ్గుతాయని జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తిలో నిర్వహిస్తున్న గ్రామ సమైక్య సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కిశోర బాలికలు, వారి తల్లులు, గర్భిణులు, బాలింతలు రక్తహీనత నివారణ కోసం సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ఐరన్ ఎక్కువగా ఉన్న రాగి సంగటి, రాగి రొట్టె, రాగి జావ, కర్జూరాలు, ఎండు ద్రాక్ష, బెల్లంతో చేసిన పిండి వంటలు, బాలామృతం, కోడి గుడ్లు తీసుకోవాలని, దీనివల్ల ఎనీమియాను నివారించవచ్చన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల సాధారణ కాన్పు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస, సిహెచ్‌వో ఇందిరారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫి, సూపర్‌వైజర్ పూర్ణమ్మ, ఎఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పదికి ప్రత్యేక ప్రణాళిక



ప్రత్యేక తరగతిలో పది విద్యార్థులు

పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు:	24,310 మంది
ప్రభుత్వ పాఠశాల నుంచి:	912 మంది
జెడ్పీ హైస్కూళ్ల నుంచి :	10,647 మంది
మున్సిపల్ హైస్కూళ్ల నుంచి:	785 మంది
రెసిడెన్షియల్ హైస్కూళ్ల నుంచి :	1,341
కేజీబీవీ పాఠశాలల నుంచి :	799 మంది
ఏపీ మోడల్ స్కూళ్ల నుంచి :	1,484 మంది
ప్రైవేటు ఎయిడెడ్ నుంచి :	224 మంది
ప్రైవేటు అన్‌ఎయిడెడ్ నుంచి:	7,189 మంది
మదరసాల నుంచి:	20 మంది
ఇతరులు (ఓరియంటల్, మినీ గురుకులాలు):	909

- ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- షెడ్యూలు విడుదల
- ఈసారి ఆరు పేపర్లే

మదనపల్లె సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయం దగ్గర పడుతోంది. ఈ మేరకు ప్రభుత్వం పరీక్షల షెడ్యూలు విడుదల చేసింది. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. పదో తరగతిలో వంద ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ముందుకెళుతున్నారు. ఇందు కోసం పిల్లలకు ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 24,310 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠ్యాంశాలకు సంబంధించి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోజూ ఉదయం 8.30 నుంచి 9.30 వరకు సాయంత్రం 4.45 నుంచి 5.45 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతంలో రెండు సంవత్సరాల పాటు కరోనా కారణంగా పరీక్షలకు దూరమైన విద్యార్థులు గత విద్యా సంవత్సరం నుంచి పరీక్షలు రాస్తున్నారు. గతంలో 11 పేపర్లకు పరీక్ష నిర్వహించేవారు. కరోనా సమయంలో ఆ పేపర్లను ఏడింటికి కుదించారు. ఏడు పేపర్లలో సైన్స్‌ను ఫిజికల్ సైన్సు, నేచురల్ సైన్సు కింద రెండు పేపర్లను 50 మార్కుల చొప్పున నిర్వహించేవారు. తరువాత మళ్లీ సైన్సులోని రెండు పేపర్లను కూడా ఒకే పేపర్‌గా చేస్తూ టెన్త్ పబ్లిక్ పరీక్షలను ఆరింటికి కుదించింది. గతంలో టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇచ్చి పబ్లిక్ పరీక్ష పేపర్లను 80 మార్కులకు జరిపేవారు. ఇంటర్నల్ మార్కుల్లో ప్రైవేటు స్కూళ్ల యజమాన్యం అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో రద్దు చేశారు. పబ్లిక్ పరీక్షల పేపర్లను పూర్తిగా వంద మార్కులకు నిర్వహించనున్నారు.

'మార్కుల ఆధారంగా

విద్యార్థులకు సమ్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కులు ఆధారంగా వారిని గ్రేడ్‌గా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఈ క్రమంలో వెనుబడిన విద్యార్థులపై ముందు నుంచే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థులకు పదో తరగతి భవిష్యత్తుకు కీలకం. ఉదయం, సాయంత్రం చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ ప్రత్యేక బోధన వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు చెబుతున్నాం. -కృష్ణప్ప, డివైఈఓ,మదనపల్లె

ప్రత్యేక తరగతులతో ప్రయోజనం



ప్రత్యేక తరగతుల ఎంతో ప్రయోజకరంగా ఉంది. వెనుబడిన విద్యార్థుల పురోగతికి తోడ్పడుతుంది. పాఠ్యాంశాల్లోని సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. పరీక్షల విధానాన్ని తెలుసుకుని వాటికనుగుణంగా తర్ఫీదు పొందుతున్నాం. -ప్రసన్న, పదో తరగతి, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

అందరికీ ఉపయోగకరం



ప్రత్యేక తరగతులు విద్యార్థులందరికీ ఉపయోగకరం. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవడం వల్ల మంచి మార్కులు సాధించవచ్చు. వెనుకబడిన విద్యార్థులు పురోగతిని సాధించడానికి ఇది మంచి అవకాశం. -కె.నాగార్జునరెడ్డి, పదో తరగతి, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల,మదనపల్లె

ఉగాది నాటికి 22వేల ఇళ్లు నిర్మించాలి



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

- అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్
- వాల్మీకిపురం, పీలేరు, కోడూరు ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు జారీ

రాయచోటి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ఉగాది పండుగ నాటికి జిల్లాలోని జగనన్న లే అవుట్లలో చేపట్టిన 22,229 ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంపీడీఓలు, గృహనిర్మాణశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జగనన్న లే అవుట్‌లలో గృహనిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బిల్లుల ఆన్‌లైన్ అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, గృహనిర్మాణశాఖ డీఈలు, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. జగనన్న లే అవుట్‌లోనే కాకుండా అర్హులు ఎవరైనా సొంత స్థలాల్లో ఇళ్లను ప్రారంభించుకొని ఉంటే వాటికి కూడా మ్యాపింగ్ జియో ట్యాగింగ్ వెంటనే చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని డీఈలు, ఏఈలు స్వయంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి అవసరమైన వారందరికీ ఎస్‌హెచ్‌జీలు ద్వారా రుణాలు ఇప్పించే కార్యక్రమాన్ని వేగవంతం చేసేలా డీఆర్‌డీఏ ఏపీఎం, ఆర్‌పీలు స్వయంగా కృషి చేయాలన్నారు.

హౌసింగ్ ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్లకు ఆదేశాలు

గృహ నిర్మాణంలో ఇచ్చిన లక్ష్యాలను సాధించడం, ప్రగతిలో వెనుకబడటం, విధుల నిర్వహణలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం, వారం వారం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయలేకపోవడంతో వాల్మీకిపురం, రామాపురం గృహనిర్మాణ శాఖ ఏఈలు సుబ్బారెడ్డి, కేఎస్‌ఎం ప్రసాద్, రామసముద్రం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ హౌసింగ్ పీడీని ఆదేశించారు. అలాగే పీలేరు, కోడూరు మండలాల్లో గృహనిర్మాణాల ప్రగతిలో తగిన పర్యవేక్షణ చేయకపోవడంతో వాల్మీకిపురం, పీలేరు, కోడూరు ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శివయ్య, సిపిఓ కృష్ణ నాయక్, ఏడీ వెంకటేష్, డీఆర్‌డీఏ పిడి నారాయణ, ఎంపీడీఓలు, గృహనిర్మాణశాఖ డీఈలు, ఈఈలు, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి

జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష, సమగ్ర సర్వే కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోపల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో రీ-సర్వే, భూ సేకరణ, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో స్మశాన వాటికల స్థలాల గుర్తింపు, తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ-సర్వే పక్కాగా, పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో దీనికి సంబంధించి అవసరమైన సర్వేయర్లు, సిబ్బంది ఉన్నారని, రీ సర్వేను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆర్డీఓలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, కోదండరామిరెడ్డి, మురళీ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరువ చేయాలి

ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయ రెడ్డి

కలికిరి: ప్రభుత్వ పథకాలు అర్హులకు మరింత చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సలహాదారు ధనుంజయరెడ్డి అన్నారు. కలికిరి ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నవరత్నాల పథకాలు అమలు తీరుపై అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయం, సచివాలయ వ్యవస్థ, నవరత్నాలు అమలుపై ప్రత్యేక శ్రద్ధవహించారన్నారు. క్షేత్ర స్థాయిలో ఆయా పథకాలు అమలు తీరు, జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి సంబంధిత అధికారులను విచారించారు. సచివాలయ ఉద్యోగుల సేవలకు సరైన పర్యవేక్షణ అవసరమని, ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ముందడుగు వేస్తున్నారని, రాబోవు కాలంలో ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి ఎస్టీడి హరి తదితరులు సీఎం సలహాదారు ధనుంజయరెడ్డిని కలిశారు. కార్యక్రమంలో మదనపల్లి డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ గంగయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ గంగయ్య, మహేంద్రరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం



స్వామి వారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న పురోహితులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతాసమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదికపై అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధద్రవ్యాలతోపాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు కనుల పండువగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వీక్షించి, తన్మయులయ్యారు.

ఆ ఠీవి.. ఆకాశమంత



ఆకాశాన్నంటుతున్న మామిడి వృక్షాలు



మామిడిచెట్టుతో పెనవేసుకున్న రావి చెట్టు

- బి.కొత్తకోట మండలంలో 200 ఏళ్ల నాటి మామిడి వృక్షాలు
- చూడాలంటే తల ఎత్తాల్సిందే

బి.కొత్తకోట: మనం నివసించే ప్రాంతం..మన చుట్టూ కనిపించే కట్టడాలు, చిహ్నాలు చరిత్రకు ఆనవాళ్లుగా ఉంటాయి. ఆ కోవకు చెందినవే బి.కొత్తకోట మండలం కొత్తవుడియం శివారులోని మామిడి మహా వృక్షాలు. పండ్లలోనే కాదు వయసులోనే రారాజే అంటూ ఇవి ఠీవిని ఒలకబోస్తున్నాయి. నింగిని తాకుతున్నాయా అనిపించేలా కనిపించే ఈ మహా మామిడి వృక్షాల వయసు 200 ఏళ్లకుపైమాటే అని గ్రామానికి చెందిన పెద్దలు అంటున్నారు. వీటిని చూస్తే బ్రిటీష్‌పాలనకు సాక్ష్యంగా నిలుస్తోంది. గ్రామస్తులు చెప్పిన వివరాల ప్రకారం..బి.కొత్తకోట మండలం సూరప్పగారిపల్లె పంచాయతీకి చెందిన కొత్తవుడియం గ్రామానికి శివారులో వాగు ప్రవహిస్తోంది. ఈ వాగుపైన బ్రిటీష్ పాలకులు 30 మామిడి మొక్కలు నాటి సంరక్షించారు. అవి పెరిగి పెద్దవై మహా వృక్షాలు ఎదిగాయి. ఇవి ప్రస్తుతం కొత్తవుడియంకు ల్యాడ్‌మార్క్‌గా నిలుస్తున్నాయి. వృక్షాలను తిలకించాలంటే తలపైకి ఎత్తాల్సిందే. ఇలాంటి ఎత్తయిన, గుబురుగా పెరిగిన వృక్షాలు ఎక్కడా కనిపించవు. ఇవి మా తాత, ముత్తాతల కాలం నుంచి ఉన్నాయని, 200ఏళ్లకు పైబడి వయసు ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఒక్కో వృక్షం ఎత్తు 100 మీటర్ల దాకా ఉంటాయి. గంభీరంగా, నిటారుగా ఎదిగిన ఈ వృక్షాలు కొత్తవుడియానికి విశేషం. వీటిపైకి ఎక్కాలంటే ఎవ్వరికి సాధ్యంకాదు. వీటిని దూరం నుంచి చూస్తే ఆకాశాన్ని తాకుతున్నాయా అని అనిపిస్తుంది. ఈ 30 వృక్షాల్లో 26 కాలగమనంలో కొన్ని నశించిపోగా, కొన్నింటి అక్రమంగా నరికి తరలించుకొన్నారు. ఇప్పుడు మిగిలింది నాలుగే వృక్షాలు. అందులో రెండు ఒకచోట, సమీపంలో మరో రెండు ఉన్నాయి. వీటిలో ఒకదానిని రావి చెట్టు పెనవేసుకుని ఉంది.

మా తాత గారు చెప్పేవారు



కొత్తవుడియం మామిడి వృక్షాల గురించి నా చిన్నప్పుడు మా తాత, మా నాన్న చెప్పేవారు. వీటి వయసు 200 ఏళ్లకు పైబడి ఉంటుందని పల్లెకు చెందిన పెద్దలు ఇప్పటికి చెబుతున్నారు. మా గ్రామానికే ఈ వృక్షాలు అలంకరణగా నిలుస్తున్నాయి. -రాజశేఖర్‌రెడ్డి, సూరప్పవారిపల్లె

ఫలించిన ఎర్ర ప్రయోగం

ఏపుగా ఎదిగిన ఎర్ర చందనం వృక్షాలు



చలిమామిడిరోడ్డులోని ఎర్రచందనం వృక్షాలు

బి.కొత్తకోట: ఎర్ర చందనం అంటే శేషాచలం అటవీ ప్రాంతానికే పరిమితం. ఇక్కడ తప్ప ఎక్కడా ఎర్ర చందనం దొరకదని అంటారు. అయితే 2000 ఏడాదిలో అటవీశాఖ అధికారులు సాధారణ అటవీప్రాంతంలో ఎర్రచందనం మొక్కలు నాటి వాటి ఎదుగుదలపై ప్రయోగం చేశారు. ఇప్పుడివి వృక్షాలై కనిపిస్తున్నాయి. అధికారులు చేపట్టిన ప్రయత్నం ఫలించింది. బి.కొత్తకోట మండలం బి.కొత్తకోట-చలిమామిడి మార్గంలోని అచ్చమ్మకోన సమీపం రిజర్వ్‌ఫారెస్ట్‌లో అప్పటి అధికారులు ఎర్ర చందనం విత్తనాలు తీసుకొచ్చి నాటారు. పూర్తిగా రాళ్లు, రప్పలు, బండలతో కూడిన ఈ ఆటవీప్రాంతంలో ముళ్లకంపులు, నీలగిరి మొక్కలు, ఇతరా జాతుల మొక్కలు ఉన్నాయి. వీటి మధ్యలో 400 ఎర్ర చందనం విత్తనాలు నాటడంతో అవి మొలచి మొక్కలై వృక్షాలయ్యాయి. ప్రస్తుతం వీటి వయసు 12 ఏళ్లు. ఈ మార్గంలో ప్రయాణించే కొత్త వ్యక్తులు ఎర్ర చందనం వృక్షాలు అని ఆసక్తిగా తిలకిస్తుంటారు. పెరిగిన వృక్షాల్లో దొంగలు కొన్నింటిని నరికివేశారు. కొన్ని చెట్ల కాండం వద్ద గాట్లు పెట్టారు. ఇప్పుడీ ఎర్ర చందనం వృక్షాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. అచ్చమ్మకొన వద్ద సేదతీరే, విందులు చేసుకోవడానికి వచ్చేవాళ్లు ఎర్ర చందనం వృక్షాలను తిలకిస్తుంటారు.

ఇంకా ఎదగాలి



చలిమామిడి మార్గంలో పెంచిన ఎర్ర చందనం పూర్తిస్థాయి నాణ్యత రావాలంటే మరో పదేళ్లు పడతుంది. వీటి సంరక్షణ కోసం నిత్యం నిఘా ఉంచాం. మూడురోజుల క్రితం వృక్షాలను పరిశీలించాం. దొంగలు వీటిని నరికి తరలించినా ఉపయోగం ఉండదు.ఎవరూ కొనుగోలు చేయరు.

– అదపా శివకుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, హార్సిలీహిల్స్

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం కేసు నమోదు


శివధనీష్ (ఫైల్)

ఓబులవారిపల్లె : బాలిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన ఆల్లం శివధనీష్ గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని తల్లి ఆల్లం లక్ష్మమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిరెడ్డిపల్లె గ్రామంలో జిల్లా పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న శివధనీష్ రోజూ మాదిరిగా గురువారం ఉదయం బయలుదేరి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లి లక్ష్మమ్మ పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించగా ఉదయం నుంచి పాఠశాలకు రాలేదని తెలిపారు. దీంతో చుట్టు పక్కల బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కోడిపందెం ఆటగాళ్లు అరెస్ట్


కోడిపందెం ఆటగాళ్ల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ, పోలీసులు

కలకడ : కోడిపందెం ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సిటి స్వామి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మండలంలోని గంగాపురం పంచాయతీ కురవపల్లె సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్లు అందిన సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బంది రాజేంద్ర, నాయక్, తాతయ్య, శ్రీనివాసులు, ఖలాల్‌తో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కోడి పుంజులు, రూ.9,260 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని గూడరేవుపల్లె పంచాయతీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ రవి తెలిపారు. ఆ స్థలంలో శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే నంబరు 200/3లో 0.53 సెంట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొంత మంది రియల్టర్లు ఆక్రమించుకుని చదును చేయడంతో తాము స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇది ప్రభుత్వ భూమి, ఇందులో ఎవరూ ప్రవేశించరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజశేఖర్, వీఆర్వో రెడ్డిరాణి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బోర్డు ఏర్పాటు చేసిన అరగంటలో గుర్తు తెలియని వ్యక్తులు బోర్డు తొలగించారు.

ఉజ్వల భవితకు 'నవోదయ'ం

- ప్రణాళికతో సిద్ధమైతే సీటు గ్యారంటీ
- 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుకు ఆఖరు తేదీ జనవరి 31


మదనపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయం

మదనపల్లె సిటీ : గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ ప్రమాణాలు కలిగిన విద్యను అందించడంతోపాటు జాతీయ సమైక్యతకు కృషి చేయడం వంటి ఆశయాలతో ఏర్పాటైందే జవహర్ నవోదయ విద్యాలయం. 6 నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ విద్యతోపాటు హాస్టల్ వసతి ఉంటుంది. జిల్లాలో మదనపల్లె పట్టణ సమీపంలోని వలసపల్లెలో నవోదయ విద్యాలయం ఉంది. ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఎంతో మంది ఈ ప్రవేశ పరీక్షకు పోటీ పడతారు. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు నవోదయ సీటు రావాలని కలలు కంటారు. 100 మార్కులకు దాదాపుగా 90 మార్కులకు పైనే సాధిస్తేనే సీటు దొరికే అవకాశం ఉంటుంది. నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నవోదయ విద్యాలయం, శిక్షణ, ప్రవేశానికి అర్హతలు, పరీక్షల విధానం తదితర అంశాలపై ప్రత్యేక కథనం.

జవహర్ నవోదయలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇందులో ప్రాధాన్యం ఇస్తారు. కార్పొరేటుకు దీటుగా విద్యను అందిస్తూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష ప్రకటన విడుదలైంది. జనవరి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 3, 4 తరగతులు ఉత్తీర్ణత పొంది ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి. మదనపల్లెలోని వలసపల్లె వద్దనున్న నవోదయ విద్యాలయంలో 80 సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారు. 33 శాతం సీట్లు బాలికలకు కేటాయిస్తారు.

అన్నీ ఉచితమే

నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉచితమే. ఆరు నుంచి 12వ తరగతి వరకు అత్యుత్తమ విద్య అందిస్తారు. యూనిఫారం, బూట్లు, పుస్తకాలను ఇస్తారు. ఆరోగ్య పర్యవేక్షణ కోసం వైద్యులు అందుబాటులో ఉంటారు.

ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు

శారీరక దారుఢ్యం, మానసికోల్లాసానికి క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. నవోదయ ప్రాంగణంలో సువిశాలమైన క్రీడా ప్రాంగణం ఉంది. ఈ ఏడాది పాఠశాలలో రీజనల్ మీట్ నిర్వహించారు. ఎంతో మంది రీజియన్, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొంది విద్యాలయానికి గుర్తింపు తెస్తున్నారు. నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాలల్లోనూ శిక్షణ ఇస్తున్నారు.

అధునాతన కంప్యూటర్ ల్యాబ్

కాలానికి అనుగుణంగా విద్యార్థులకు అత్యుత్తమ బోధన చేసేందుకు అధునాతన కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. నిపుణలైన అధ్యాపకులతో బోధన అందిస్తున్నారు.

పరీక్షా విధానం

100 మార్కులకు 80 ప్రశ్నలు ఉంటాయి

పరీక్ష	ప్రశ్నల సంఖ్య	మార్కులు	వ్యవధి (ని.)లలో
మేధాశక్తి	40	50	60
గణితం	20	25	30
భాష పరీక్ష	20	25	30
మొత్తం	80	100	2 గం.

ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్
www. navodaya.gov.in

విలువలతో కూడిన విద్య



విద్యార్థుల ఉజ్వల భవితను దృష్టిలో పెట్టుకుని విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాం. అధునాతన హంగులతో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థుల్లోని ప్రతిభకు మెరుగులు దిద్దుతూ వారు ఉన్నత స్థానాలకు చేరుకునేలా చూడటమే మా ధ్యేయం.
– కాశయ్య, ప్రిన్సిపల్, నవోదయ విద్యాలయం, మదనపల్లె

ప్రాజెక్ట్‌తో అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు


గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి

వీరబల్లి : ప్రాజెక్ట్ నిర్మాణంతో అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు కలుగుతాయని డీఆర్‌ఓ సత్యనారాయణరావు తెలిపారు. వీరబల్లి మండలంలోని వంగిమల్ల గ్రామం దిగువరాచపల్లె సమీపాన అటవీ ప్రాంతంలో ఎన్విరాన్మెంటల్ ఇంప్యాక్ట్ అసైన్మెంట్ వీరబల్లి ఆఫ్ స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుపై శుక్రవారం ఆ గ్రామ పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు ప్రముఖులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వ ధర ప్రకారం డబ్బులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మిస్తే గ్రామంతోపాటు మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. సుమారు 4 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రజలకు, రైతులకు ఎలాంటి హాని ఉండదని, కేవలం నీటిని స్టోరేజ్ చేసుకొని ఆ నీటిని పంపింగ్ చేసుకుంటూ విద్యుత్ ఉత్పత్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అంతేగాని ఎలాంటి కెమికల్ దుర్వాసన ఉండదని, బయట వారు చెప్పే అపోహలు నమ్మవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రీజనల్ ఆఫీసర్ జావిద్ బాషా, సీనియర్ ప్రముఖ నాయకులు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కలూరు రామ్మోహన్‌రెడ్డి, యువ నాయకులు మదన్‌రెడ్డి, ఎన్విరాన్మెంటల్ కన్సల్టెంట్ ప్రసాద్ రాజు, అడ్వైజర్ డీఎస్పీ శ్రీధర్ బాబు, తహశీల్దార్ తులసమ్మ, విద్యుత్, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కత్తితో దాడి

– వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ఆర్థిక వివాదాలలో భాగంగా ఘర్షణ పడి యువకుడు కత్తితో వ్యక్తిపై దాడి చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇండ్రస్టియల్ ఎస్టేట్‌కు చెందిన టి.వారాధి (62) తమలపాకుల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. ఏడాది క్రితం వాల్మీకిపురం మండలం సాకిరేవుపల్లికి చెందిన రెడ్డిశేఖర్‌కు రెండు విడతలుగా రూ.90 వేలు అప్పు ఇచ్చాడు. అనంతరం రెడ్డిశేఖర్ తన మరదలైన కలికిరి మండలం పాలెంకురవపల్లెకు చెందిన పార్వతికి అదే నగదును వడ్డీకి ఇచ్చాడు. అయితే ఆమె వడ్డీ చెల్లించకపోవడంతో కొద్ది రోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్పు ఇచ్చిన వారాధి తరచూ రెడ్డిశేఖర్‌పై అప్పు చెల్లించాలని ఒత్తిడి చేశాడు. దీంతో అతడు పార్వతిని వేధించడంతో వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఇది ఇలా ఉండగా గురువారం వారాధి సాకిరేవులపల్లికి వెళ్లి రెడ్డిశేఖర్‌ను గట్టిగా నిలదీశాడు. అయితే శుక్రవారం ఉదయం పార్వతి కుమారుడు భానుప్రకాష్ మదనపల్లెకు చేరుకుని వారిధితో ఘర్షణకు దిగాడు. ఆవేశానికి గురై కత్తితో వారాధిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. నిందితుడు భానుప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

కలకడ : ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సిటి స్వామి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 3వ తేదీన లారీ మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన నాగులును ఢీకొని గాయపరిచింది. లారీ డ్రైవర్ పరారీ కావడంతో నాగులు కుమారుడు శివరామమూర్తి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రాజంపేట : మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రవి తెలిపారు. శుక్రవారం రాజంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో ఏఐటీఎస్ పీజీ కాలేజీలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, అక్రమ రవాణా వ్యతిరేకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల అనర్థాల గురించి తెలిపే సందేశాత్మక షార్ట్‌ఫిలిం పరివర్తనను ప్రదర్శించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డా.డీజె సమతానాయుడు పాల్గొన్నారు.

యువకులపై కేసు నమోదు

మదనపల్లె : నడిరోడ్డులో విచక్షణ రహితంగా కొట్టుకున్న 8 మంది యువకులపై రెండు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. అందులో నలుగురిపై పోక్సో కేసు, మరో నలుగురిపై దాడి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 3న స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా కొందరు యువకులు క్రికెట్ బ్యాట్‌లతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడటం, సంఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విచారణ చేసి యువకులను గుర్తించినట్లు తెలిపారు. సంఘటనకు గల కారణాలను ఆయన వివరించారు. నిమ్మనపల్లె మండలం తవళం గ్రామానికి చెందిన విద్యార్థి సంతోష్ మదనపల్లెలోని ఓ డిగ్రీ కాలేజీలో చదువుతున్నాడు. ఇటీవల ఓ ఇంటర్ విద్యార్థినికి ప్రేమను వ్యక్తం చేసి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం ఘర్షణకు దారి తీసింది. విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన సమాచారం యువతి అన్న (పెద్దనాన్న కుమారుడు) మహమ్మద్‌అలీకి తెలియడంతో తన స్నేహితులు షాహిద్, పురుషోత్తం, సందీప్‌తో కలిసి, విద్యార్థినిని టీజ్ చేసిన సంతోష్, అతని స్నేహితులు వినోద్, మల్లికార్జున, ఓబులేసుపై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో సంతోష్ వర్గంపై అమ్మాయిని వేధించినందుకు పోక్సో కేసు నమోదు చేయగా, మహమ్మద్‌అలీ వర్గంపై దాడి కేసు నమోదు చేశారు. క్రమశిక్షణ చర్యలో భాగంగా కాలేజీకి నోటీసులు ఇచ్చినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డాక్టర్ కొండయ్య

వీరబల్లి : వీరబల్లిలోని పీహెచ్‌సీలో ఎఫ్‌ఆర్‌ఎస్, జాతీయ కార్యక్రమాల రిపోర్టును అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విష్ణు, బి.వేణుగోపాల్, జిల్లా మలేరియా నివారణ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వైద్యాధికారి డాక్టర్ పవన్‌తో కలిసి వీరబల్లి గ్రామంలోని ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డితో కలిసి దోమలు ద్వారా వ్యాపించే వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మురికి నీరు, పారుదల లేని గుంతలను తెలియజేస్తే లార్వా నివారణ కోసం గంబూజియా చేపలు పంపిస్తామని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, సీహెచ్‌ఓ సుధాకర్, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, సుబ్బయ్య, హెచ్‌ఎస్ వీరబల్లి సచివాలయ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. లక్కసముద్రం పంచాయతీ అడవికుంటపల్లెకు చెందిన రెడ్డప్ప, ఆయన భార్య నాగవేణి(34) కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. మనస్తాపం చెందిన ఆమె పొలం వద్ద గుళికల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జ్యోతిష్యుడిపై హత్యాయత్నం

గుర్రంకొండ : మండలంలోని సంగసముద్రం పంచాయతీ కుమ్మరపల్లెలో శుక్రవారం జ్యోతిష్యుడిపై హత్యాయత్నం జరిగింది. గ్రామానికి చెందిన పి.మదార్‌ఖాన్(62) జ్యోతిష్యం చెప్పుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ సమీపంలోని కోతుల గుట్ట వద్ద ఆశ్రమంలాగా ఏర్పాటు చేసుకొని జ్యోతిష్యం చెబుతుంటాడు. ఈనేపథ్యంలో పెద్ద మండ్యం మండలం బండమీద పల్లె పంచాయతీ తురకపల్లెకు చెందిన నౌషాద్ అనే వ్యక్తి ఇతని వద్దకు గతంలో పలు మార్లు జ్యోతిష్యం చెప్పించుకోవడానికి వెళ్లాడు. జ్యోతిష్యంతోపాటు నౌషాద్ కొన్ని పూజలు కూడా చేయించుకొనేవాడు. అయితే ఇటీవల నౌషాద్ సదరు జ్యోతిష్యుడిపై అనుమానం పెంచుకొన్నాడు. తనకు చేతబడి చేసి చంపేందుకు మదార్‌ఖాన్ కుట్ర పన్నాడనే అనుమానంతో అతడ్ని అంతమొందించేందుకు పథకం పన్నాడు. శుక్రవారం తనతోపాటు మరో ఏడుగురితో కలిసి వేట కొడవళ్లతో వచ్చి మదాన్‌ఖాన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మదార్‌ఖాన్ చాకచక్యంగా తప్పించుకొని గట్టిగా కేకలు వేశాడు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నౌషాద్ అతని అనుచరులు పరారయ్యారు. జరిగిన సంఘటనపై బాధితుడు మదార్‌ఖాన్ ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.